

# సినిమాకు సోపానాలు

రచన: ద్రోణంరాజు కృష్ణమోహన్

తడిబట్టతో చెరువునుంచి నీళ్లబిందె తెస్తున్న రమణమ్మ శరీరపు ఒడుపులను, వయ్యారాన్ని అరుగుమీద కూర్చొని పుల్లతో పళ్లుతోముకుంటున్న ఒక పాతికేళ్ల యువకుడు తదేకదీక్షతో చూస్తున్నాడు. అనుకోకుండా రమణమ్మ కళ్లు అతనివైపు తిరిగాయి. సిగ్గుతెరలు కమ్మాయి. తన అందాన్ని, పరాయి మగవాడు, అందులోను పట్నవాసపు నవయువ్వనుడు వెర్రిగా చూస్తున్నందుకు ఒక విధమైన గర్వం, సంతృప్తి, మరోవైపు అసహ్యం, కోపం కలిగాయి. చరచర అడుగులేసింది. ఖంగారులో ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నందున, పాతుకుపోయిన ఒక రాయి ఎదురుతగిలి తూలిపడింది. బిందెడునీళ్లుపోయాయి. బిందె సొట్టపడింది. పయిట జారిపోయింది. పైకి హడావిడిగా లేచేసరికి జారుతున్న పయిటను సరిచేసుకునే సమయంలో ఆమె విశాలమైన, అతిసుందరమైన వక్షస్థలాన్ని ఆ యువకుడు పచ్చిగా చూశాడు. ఇంకెవరూలేరు ఆ చిన్న సందులో. అందుకు సంతృప్తి కలిగింది రమణమ్మకి. లేచి దబదబా వెళ్లిపోయింది. ఆమె వంకే చూశాడు అతను....అతనే....మురళి.

* * *

మురళి మేడెక్కాడు సరదాగా చల్లగాలి కోసం. అటు యిటు పచార్లుచేస్తు ఏవో వచ్చీరానివి పాడుతున్నాడు. ప్రక్కింటివారి దొడ్లో దానిమ్మచెట్టువైపు అతనిదృష్టిపడింది. జుట్టు పైకి ముడివేసుకుని నీళ్లుపోసుకుంటున్న రమణమ్మ చూపుకూడా అదేసమయానికి, తువ్వాలు అందుకునేటప్పుడు ఇటు మళ్లింది. గుండె ఝల్లుమని చప్పున తువ్వాలు చుట్టుకుంది. గాభరాగా మళ్లీ ఇటే చూసింది లోపలికి ఆడుగెడుతూ. అతని చిరునవ్వుకు ప్రత్యుత్తరమివ్వకుండానే పరుగెత్తింది.

"మీ పెద్దతల్లికొడుకా ఆ అబ్బాయి?" రమణమ్మ అడిగింది మరునాడు మధ్యాహ్నం.

"అవునమ్మా....నువ్వెప్పుడూ చూడలేదు. ఇదే మొదటిసారి రావడం యిక్కడికి...." నరసమ్మ అమాయికంగా బదులు చెప్పింది.

"ఏంచేస్తున్నారు?" ఎందుకో అన్ని అడగాలనుకుంది.

"చెప్పానుగా యిదివరకు, మద్రాసులో సినిమాల్లో ఉంటాడని"

"ఆఁ....అన్నట్లవును!....వేషాలేస్తాడా?"

"ఎబ్బె....ఎప్పుడయినా సరదాపుట్టే తప్ప మామూలుగా ఆఫీసుపనే. అదేంవిటిదమ్మా.... పోర్షన్ మేనేజిరీట .... మూడొందలిస్తారు. ఇల్లు, కారు, అన్నీ కంపెనీవాళ్లవే" తన తమ్ముడు ఘనతంతా చెప్తుకుంది. అన్నివిన్న రమణమ్మకు మురళీధరం తాను అనుకొన్నంత చెడ్డవాడు, రౌడీ వగైరా కాదని తోచింది. 'అవునుమరి! బి. యస్. సి. చదివాడు. పాతికేళ్లు నిండలేదు. నాలుగేళ్లనుంచి సినిమా ఫీల్డులో వుంటున్నాడు. గొప్పవారితో పరిచయం. చాలా గొప్ప ఉద్యోగం కాబట్టి చాలా మంచివాడు అయివుండాలి .... అయితే తనవైపు అలా వెర్రిగా ఎందుకు చూడాలి ? తన మెళ్లో మంగళసూత్రం చూసి కూడా అలా ఎందుకు చూడటం?....పాపం పెళ్లికాలేదు. సహజం....నిజానికి తనుమాత్రం అతనివైపు ఎన్నిసార్లు చూసిందికాదు! చూడాలని అనిపించలేదూ? ఇంకా అనిపిస్తూనేవుంది. ఆ అందమైన కోలమొహం, గాంభీర్యం, చక్కని కళ్ళు, నల్లని మెత్తని క్రాఫింగు నిజంగా అతనితో పోలిస్తే తన భర్తెంత! స్కూల్‌ఫైనల్ చదివి బడిపంతులుచేస్తు గొడ్లుగోద చూసుకుంటూ ఈ పల్లెటూళ్ళోవుండె తనభర్త.... మద్రాసులో దివ్యభవనంలోవుంటూ, కార్లలో తిరుగుతూ, ఇంకా పెళ్లికాకుండా ఎందరో పడుచుపిల్లలకు ఆశపెట్టూ కులాసాగా తిరిగే మురళి! ఎంత తేడా! తను చిన్నప్పుడు, బళ్లో ఫర్డుఫారం చదివేటప్పుడు కూడా ఎన్నెన్ని ఎలాంటి కలలుగన్నది! నిజంగా మురళి గనుక తన భర్తయి ఉంటేనా ? తన జీవితాశయం నెరవేరివుండేది. తను గొప్ప తార అయ్యేది, అతన్ని వలపించేది మురిపించి సర్వం మరిపించేది....కాని చివరకు తను ఈ పల్లెలో బ్రతకాల్సొచ్చింది, కోర్కెలన్నీ చంపుకుని. ఆశలన్నీ అలా ఎగిరిపోయాయి. నాలుగేళ్లక్రితమే ఎందుకో మురళిని ఈ క్రొత్త వ్యక్తిని చూసినప్పటినుంచి అవన్నీ వెనక్కి తిరిగివస్తున్నాయి. రమ్మని పిలుస్తున్నాయి ఎక్కడికో!

* * *

"ఎన్నీ...." తలుపుతీసుకుంటూ లోపలకొచ్చింది రమణమ్మ. కనిపించలేదు. దొడ్లోకెళ్లి చూసింది అక్కడాలేదు. హోరుమని గాలి, చినుకులు ప్రారంభమైనాయి. ఎవరూ లేరు. చీకటిపడుతోంది వాన పెద్దదవుతోంది. గ్రుడ్డి దీపం కాస్తా ఆరిపోయింది. 'ఎక్కడి కెళ్లిందబ్బా....చెరువుకెళ్లింది గామోలు .... తగని చాదస్తం' ఒక విగ్రహం ఎదురుగానుంచుంది. గుండె వేగంగా కొట్టుకుంది. అడుగులు తడబడి ఆ విగ్రహం దగ్గరకొచ్చింది. 'ఏన్నే కావాలా?' నెమ్మదిగా నవ్వుతూ అడిగాడు. తలెత్తిచూసి వెళ్లిపోవాలని ప్రయత్నించింది. కాని అతని పొడుగాటి బలమైన చేతులు ఆమెను ఆక్రమించి కౌగిట్లో చేర్చుకున్నాడు.

* * *

నెలరోజులు గడిచాయి. రమణమ్మభర్త బస్తీ వెళ్ళాడు ఉద్యోగం మారుద్దామని. ఇక విలుచేసుకొని మేడమీదకు పప్పులు ఆరబోయడానికో, ఒడియాలకో, ఏదో వంకనా వచ్చేది. గదిలో అతను నిద్దరనటించేవాడు. ఆమె అతనిపై పప్పులువిసిరేది. చటుక్కున చెయ్యిపుచ్చుకులాగేవాడు. ఒకసారి ఇది నరసమ్మ కంటబడింది. ఇద్దరూ తలవంచుకు నిలబడ్డారు. తమ్ముడిని చివాట్లుపెట్టింది. ఆగ్ర

అంతే. రెండురోజుల తరువాత రవణమ్మ, మురళి యిద్దరు కన్పించలేదు. రెండిళ్లమధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

* * *

"తెచ్చిన నగలన్నీ అయిపోతున్నాయ్" విచారంగా అన్నది రజని పేరు మార్చుకున్న రవణమ్మ.

"ఏం చెయ్యమంటావ్ రజనీ ఉద్యోగం పొబట్టిగానీ, లేకపోతే నీ నగల్తో సంసారం యీడుస్తానా చెప్పు?" ఆమె బుగ్గలునొక్కుతూ అడిగాడు.

"అన్నీ కబుర్లే....నిజానికి నీకు ఉద్యోగం వుండేది అసలు చెప్పు?" గట్టిగా అడిగింది.

"నిజం నమ్ము రజనీ....అప్పుడుండేది ఆ పిక్చరైపోయింది తీసేశారు. మళ్లీ ఎవర్నో ఆశ్ర యించాలి" ఆలోచనగా అన్నాడు రజనివంక అదోలా చూస్తూ.

"మేకప్‌చేయించి స్టుడియోలో టెస్ట్‌చేయిస్తా నన్నావు. నాలుగు నెలలైనా దాని మొహం ఎలావుందో యెరగను."

"తీసుకెడతా....అదంత తేలికైన పనిగాదు వెధవలకి మేతవెయ్యాలి. లేకపోతే పనిగాదు. పలుకుబడి వుండదు."

"ఏంవో మురళీ నిన్ను నమ్ముకునొచ్చాను నాకంతాచూస్తే భయంగావుంది" కళ్లలో ఒక విధమైన ఆందోళన, భయం వ్యక్తమైనాయి.

"నే వుండగానే!" బుగ్గమీద వ్రేలితో మృదువుగా కొట్టాడు.

* * *

మరో మూడు నెలలు గడిచాయి. రజనికి టెస్ట్‌జరిగింది. కాని ఆ మనుష్యులు ఆ లోకం హడావిడి, వాళ్ల ప్రవర్తన, మాటలతీరుచూస్తే మురళినిగురించి తాను ఊహించుకొన్నవన్నీ తారుమారవుతున్నట్లనిపించింది. అసలు మురళి ఉద్యోగం చేయదలచలేదన్న భావం కలిగి గట్టిగా అడుగుదామనుకుంది.

"వచ్చి ఏడు నెలలైంది. రెండువేల రూపాయల నగలు ఆఖరైనాయి. ఏంవిటి మురళీ మన సంగతి? కొంపగూడా మార్చి చిన్న దాంట్లో చేర్చావు. నువ్వుచూస్తే రెండు మూడు రోజుల కొకసారి కూడా కనపడవ్. నా కంతా అయోమయంగా వుంది" అని బాధ వెళ్ల బోసింది ఒకరోజురాత్రి.

"అలాగే వుంటుంది ఈ మహానగరంలో సంసారం. మరేంవిటనుకున్నావ్! మా వా డొకడు పిక్చరు తీస్తున్నాడు-పదిరోజుల్లో తేలి పోతుంది" ధైర్యం చెపుదామని చూశాడు.

"దొరక్కపోతే?"

"నిన్నుచూసయినా యివ్వడూ?" అనేసి అటుతిరిగాడు. రజని కలలోకూడా అనుకో లేదు ఇలా అంటాడని. మాట వింటూనే వణకు పుట్టుకొచ్చింది.

"అయితే ఉద్దేశం ఇదా?" ఊపింది బుజాలుపట్టుకొని జవాబులేదు.



"చెప్పు మురళీ నా జీవితం నీమీద ఆధార పడుంది. నాకు ద్రోహంచెయ్యకు మురళీ.... సినిమాలు వద్దు ఏమీ వద్దు. ఏదయినా ఉద్యోగంచెయ్యి నీతోనే జీవితాంతం గడుపు తాను" అని బ్రతిమాలుకుంది. కళ్లవెంట జొటజొట ప్రవహించాయి.

"హుం....పిచ్చిదానా....నా దగ్గరేంవుందని! ఈ ఫీల్డు వొదిలేదిలేదు ఏమైనా సరే. ఎప్పుడో ఉద్యోగం ఉన్నన్నాళ్ళు తినేది లేకపోతే నా పాట్లు దేవుడికెరుక" నిజం కొద్దికొద్దిగా బయట పెడుతున్నాడని తెలుసుకుంది.

"అంతా నవ్వుతున్నారు, నీలాంటి ఊర్వ శిని దగ్గిరెట్టుకుని సినిమాలో ఉద్యోగం సంపా దించలేకపోయిన వెధవనని" మళ్లీ ప్రారం భించాడు. రజని వెక్కివెక్కి ఏడుస్తోంది.

"మురళీ నువ్వింత నీచుడవని తెలిస్తే నీ వలలో పడేదాన్నిగాను. నీ చదువు, అందం అన్నీ చూసి మంచి ఉద్యోగంకాబోలని భ్రమిం చాను. కాపరం చేతులార కూల్చుకున్నాను. ఏ మొహంపెట్టుకువెళ్లను ఛీ! పాడుజన్మ!" లేచి ప్రక్కగదిలో కెళ్లి తలుపేసుకుంది. మురళి రజని వినేటట్లు నవ్వాడు.

పది రోజులు గడిచాయి. ఒకరికొకరు మాట్లాడుకోవటం చాలా తగ్గిపోయింది. రజనికి తాను చేసిన తప్పు తెలిసొచ్చింది. కాని ఏంవిటిమార్గం! బ్రతుకుమీద తీపి, మరోవైపు నీచమైన బ్రతుకు ఇంట్లో ఏంవీ లేవు. మురళి ఎక్కడో భోంచేసివొచ్చాడు. తీరికగా వసారాలో యీజీఛేర్‌లో ఊగుతున్నాడు.

"అన్నం తినలేదా" లాలనగా అడిగాడు గుమ్మంలో నుంచున్న రజనిని చూసి.

"మాడిచస్తున్నా నీ కక్కర్లేదుగా" కళ్లు తుడుచుకొంది.

"అంత ఖర్మమేంవొచ్చింది! అంతా నీ బల హీనతే. నన్నుకాదని పోలేవు. చూసిచూచి

చచ్చిపోలేవు" నవ్వాడు. అది వికటంగా తోచింది రజనికి. అసహ్యం ఎక్కువవుతోంది. కాని మురళిగతి ఈ పరిస్థితిలో. ఎంత కులాసాగా అంటున్నాడు 'చచ్చిపోలేవని' దగ్గర కొచ్చి నుంచుని, అతని కళ్లలోకి సూటిగా చూసింది. అతను చలించలేదు. పాదాలదగ్గిర వాలింది.

"నీపాలబడ్డాక తప్పుతుందా...."

అతని మోకాలుపై తలవాల్చుకుని దుఃఖం కోపం, పగ, అన్నీ దిగమ్రింగుకుంది.

★ ★ ★

రజనియిల్లు నెల్లాళ్ళలో అందరికీ బాగా పరిచయమైంది. సినిమాలోవున్న గొప్ప మధ్య రకం రాకపోకలు సాగించారు. డబ్బు సమృద్ధిగా వుంటోంది. ఇంటినిండా సరుకులు చేపుతున్నాయి. ఏడాదిలో మళ్లీ రకరకాల అందమైన చీరెలు రజనిని అలంకరించాయి. కాని డబ్బుపెత్తనం మురళిదే. ఎంతొచ్చినా లెక్క చెప్పడు. ఇది కష్టంగాతోచింది రజనికి. పైగా యింట్లో సామాన్లన్నీ తాను కొన్నట్లే భావించడం మొదలెట్టాడు మురళి. ఇది అవమానంగా తోచింది. 'తన శరీరం అమ్ముకుని సంపాదించడం వాడు పెత్తనం చెలాయించడమూనా!' రజనికి ధైర్యం, ఆవేశం క్రమంగా వృద్ధిఅవుతూవచ్చాయి. తనమీదగదా బ్రతికేది మురళి. 'ఇప్పుడిహ మురళిని యింట్లోంచి తరిమివేసి తనే స్వేచ్ఛగావుంటే ఏం? మురళి లేకుండా తనిప్పుడు బ్రతకగలదు! అన్నీ నేర్చుకుంది. రెండు సినిమాల్లో చిన్నవేషాలుకూడా జరిగాయి. ఆ దను చూసి మురళిని సాగనంపాలి. ఒక వంటమనిషిని, నౌకర్ని పెట్టుకుని తాను కాలక్షేపం చెయ్యొచ్చు. తనకు సినిమారంగంలో చాలామంది బాగా పరిచయమయ్యారు ఫరవాలేదు. పైగా మురళి తన జీవితం ఇలా తారుమారుగాపడానికి బాధ్యుడు. వానిమీద పగ తీర్చుకున్నట్లవుతుంది. తను లేకపోతే ఎలా బ్రతుకుతాడో కొన్నాళ్ళు చూడాల'ని మనసు దిట్టపరచుకుంది.

"డబ్బు లెక్కలేకుండా తగలేస్తున్నావ్! అంతా నీ పేరే బ్యాంకులో వేసుకుంటున్నావ్! ఏఁవిటిదంతా?" అని ఒకరోజు సాయంత్రం నిలదీసి అడిగింది.

"బ్యాంకులో....హ హ! ఒకేదానివి! అంతా తిండికి, బట్టకే సరిపోతుంటే" అని నవ్వాడు.

"అదేఁవిటి! మొన్ననేగదూ వెయ్యి రూపాయిలు చూపించావ్—ఏమయ్యాయి?"

"చీరెలకొట్టుబాకీ యిచ్చేశాను" నమ్మకమైన గుమాస్తాలా లెక్కచెప్పాడు.

"మురిపేస్తున్నావే! నా సొమ్మంతా తగలెయ్యడానికి నువ్వెవరివి?" కోపం పట్టలేకపోయింది.

"అబ్బ....మహ సంపాయించావ్ లే! నే అడ్డంలేకపోతే ఎవరో నీకు ఇదంతా చేసిపెట్టేది. అందర్ని ఆశ్రయించి, తిరిగి ఇంటికి తీసుకొస్తె కాస్సేపు వాళ్లని కులాసాగా నవ్వించి పంపడమేగా నువ్వు చేసేపని! శ్రమంతానాది" అని ధీమాగా అన్నాడు.

"ఓహో! తమరిదా పాపం! ఇహ తమరు శ్రమపడక్కర్లేదు. బయటికి దయచెయ్యండి" అని ఖంగుమని చెప్పేసింది.

"ఆఁ...." తెల్లబోయాడు. "వెళ్లనా! ఎక్కడికి!" లేచాడు ఖంగారుగా.

"పెద్దకిష్టలోకి .... ఎక్కడికైనా తగలడు. కొంపలో అక్కర్లేదు...."

"ఏఁవిటి రజనీ ఇది నువ్వేనా ఈ మాటలనడం" దగ్గిరగా వచ్చాడు. రజని దూరంగా తొలిగింది.

ఆరాత్రి రజని మంచినిద్రలోవుంది మురళి మెల్లగా లేచి, బీరువా సమీపించాడు సొరుగులో ఐదు వందలుతీశాడు. నెక్లెసులు రెండు జేబులో వేసుకున్నాడు. ఆఖరుకు రజని చేతి గడియారంకూడా తీసుకున్నాడు. అడుగులో అడుగేసుకుంటూ జారుకుంటూ వెనక్కి తిరిగి చూసి, అమూల్యమైన వస్తువు పోగొట్టుకున్నట్లనిపించింది. అయినా అప్పటికి అదే ఉత్తమమైన మార్గంగా తోచింది. రజని చేసినపనికి చంపేద్దామా అనుకొన్నాడు. కాని ఎలాగో నేరం బయటపడుతుంది. ఉరిత్రాళ్లు కనిపించాయి కాని ధైర్యం రాలేదు.

ఆ తరువాత రెండు మూడుసార్లు తిరిగి రజనిదగ్గిరకొచ్చాడు. మొదటిసారి రజని మాట్లాడలేదు. రెండోసారి తలుపుతియ్యలేదు. మూడవసారి ఇంటినౌకరు తన్నడానికొచ్చాడు.

రజనికిప్పుడు పెద్దవ్యాపారం ఆమె అందం ఆమె శరీరం. కాని ఆమె ఒక కళాకారిణే. ఆ పేరుతోనే జనం ఆమెను పిలుస్తారు, పెద్ద తారలవెంట వెళ్ళినపుడు ఆమెకుకూడా ఒక పూలదండ, సన్మానపత్రం యిస్తారు. కాబట్టి ఆమెలోని కళాప్రతిభనే గుర్తించి, చెడుకోనం అసలు తొంగిచూడరాదని చదువరులకు, నిజమైన కళాకారుల, రచయితల, దర్శకుల విన్నాతల విజ్ఞప్తి. ★



"విజయకోట వీరుడు" లో
వైజయంతిమాల—పద్మిని నాట్యం చేయుచున్న దృశ్యం